

అందంగా పల్లె ప్రకృతివనం


గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్


గ్రామంలో నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్

# కొండంత అభివృద్ధిలో కొండపల్లి

*తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ కల్పించేందుకు ప్రత్యేక పథకాలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ప్రతి గ్రామంలో పచ్చదనాన్ని నింపేందుకు హరితహారం, శ్మశాన వాటిక, పల్లె ప్రకృతివనం, పాఠశాలలు, కార్యాలయాలలో, రోడ్లకు ఇరువైపులా మొక్కలు పెంచడంతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తలపిస్తోంది. గ్రామాల ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.*
*– పెంచికల్‌పేట్, నవంబర్ 9*

పెంచికల్ పేట్ మండలంలోని కొండపల్లి గ్రామ గ్రామ పంచాయతీ అభివృద్ధి పథంలో దుసుకెళ్తున్నది. అర్హులంద రికీ ప్రభుత్వ పథకాలు అమలు, నిధులను సద్వినియోగం చేసుకుంటూ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారు. గ్రామంలో మొత్తం 520 కుటుంబాలు (2000) జనాభా నివసిస్తున్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందిస్తున్న నిధులు, సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రత్యేక కృషి గ్రామస్తుల సహకారంతో సర్పంచ్,పంచాయతీ కార్యదర్శి గ్రామంలో అభివృద్ధి పనులను చేపడుతున్నారు. వాటికి తోడు అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారు. గ్రామంలో 340 మంది ఆసరా పెన్షన్లు అందుకుంటున్నారు. గ్రామాభివృద్ధికి డ్రైనేజీలు రూ.2 లక్షలు, కల్వర్టులు రూ.6లక్షలు, అంతర్గత మరమ్మతులకు మొరం రోడ్డు 20 లక్షలు, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి 1 కోటి, 3 మిషన్ భగీరథ మంచినీటి వాటర్ ట్యాంకులు, కార్యాలయాలకు మరుగుదొడ్లకు 2 లక్షల రూపాయలు, కల్యాణలక్ష్మి ద్వారా 30మందికి లబ్ధి, దళితబంధు ఒకరికి 10 లక్షలు, గొర్రెల యూనిట్ ద్వారా 80మందికి లబ్ధి, రైతు బీమా 6గురికి ,రూ.30లక్షల లబ్ధి, బీసీబంధు పథకం ద్వారా 12 మందికి 12 లక్షల రూపాయలు, ఆరోగ్య ఉప కేంద్రానికి రూ.13 లక్షల మంజూరు, లోడ్పల్లి నుంచి కొండపల్లి వరకు బీటీ రోడ్డు రెన్యువల్ చేయడానికి ఒక కోటి రూపాయలు మంజూరు,గ్రామం మధ్యలో గల వాగుపై లోయర్ వంతెన నిర్మాణానికి రెండు కోట్ల 45 లక్షల రూపాయలు మంజూరు, రైతుబంధు 609 మందికి అందిస్తున్నారు. పాఠశాలకు మన ఊరు మనబడి ద్వారా కొండపల్లికి రూ.20 లక్షలు, జైహింద్ పూర్ పాఠశాలకు 12 లక్షల రూపాయల నిధులు మంజూరుతో రూపురేఖలు మారిపోయిన పాఠశాల, ప్రత్యేక నిధులు, సంక్షేమ పథకాలు సద్వినియోగంతో గ్రామం ప్రగతి పథంలో పయనిస్తున్నది. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పల్లె ప్రకృతి వనం గ్రామ ప్రారంభంలో ఏర్పాటు చేయడంతో ఏపుగా మొక్కలు పెరగడంతో ఆహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తున్నది. మరోవైపు రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు,పాఠశాలలు కార్యాలయాలలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి పచ్చని తోరణాలను తలపిస్తున్నాయి.


పూర్తైన శ్మశాన వాటిక


గ్రామంలో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్

- అందంగా అంతర్గత సీసీ రోడ్లు
- వాగు పై లోయర్ వంతెన నిర్మాణం
- బీటీ రోడ్ల రెన్యువల్ కు రూ.1 కోటి మంజూరు
- పూర్తైన శ్మశాన వాటిక, పల్లె ప్రకృతి వనం,సెగ్రిగేషన్ షెడ్
- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కృషితో అభివృద్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

### గ్రామంలో బురద రోడ్లు కనుమరుగయ్యాయి



రాష్ట్ర ఏర్పాటుకు ముందు గ్రామంలో అంతర్గత రోడ్లు మోకాలు మంటి బురద ఉండేది. ఉమ్మడి రాష్ట్రంలో పట్టించుకునే నాయకులే లేకుండే. స్వరాష్ట్ర ఏర్పాటుతో ప్రభుత్వ నిధులతో గ్రామంలో దాదాపు ఒకటి రెండు తప్ప 100 శాతం సీసీ రోడ్లు పూర్తి చేశారు. దీంతో గ్రామం రూపురేఖలు మారిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటాం చాలా సంతోషంగా ఉంది.

**- బబ్బెర శ్రీనివాస్,యువకుడు కొండపల్లి**

### ఎమ్మెల్యే సహకారంతోనే అభివృద్ధి..



మా కొండపల్లి గ్రామానికి అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఒకేసారి 60 లక్షల అంతర్గత సీసీ రోడ్లు మంజూరయ్యాయి. అంతకుముందు రూ. 20 లక్ష లు చేయించారు. వాటికి తోడు రూ. 20 లక్షలు గ్రామపంచాయతీ నుంచి సీసీ రోడ్ వేశాం. ఏ వీధిని చూసినా అందంగా మెరిసిపోతున్నది. మరింత అభివృద్ధి కోసం ఇటీవల కూడా రూ.10 లక్షల ప్రత్యేక నిధులను విడుదల చేశారు. పనులను ఎంపిక చేసి పంపించాం. ఎమ్మెల్యే కోనప్పకు, సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

**- ఉపాసి సంజీవ్, సర్పంచ్ కొండపల్లి**

### అందరి సహకారంతోనే అభివృద్ధి



గ్రామస్తులు ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమైపుతున్నది. గ్రామంలో శ్మశాన వాటిక,సెగ్రిగేషన్ షెడ్డు, పల్లె ప్రకృతి వనం, సీసీ రోడ్లు, డ్రైనేజీలు పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చినం. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందించేందుకు కృషి చేస్తున్నాం. సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యమవుతున్నది.

**- శ్రీకాంత్, పంచాయతీ సెక్రటరీ, కొండపల్లి**

## సిర్పూర్(టీ)లో ఐదు నామినేషన్లు

సిర్పూర్(టీ), నవంబర్ 9: సిర్పూర్(టీ) అసెంబ్లీ నియోజకవర్గానికి గురు వారం ఐదు నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా అదనపు కలెక్టర్, రిటర్నింగ్ అధికారి దీపక్ తివారీ తెలిపారు. సిర్పూర్(టీ) అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, బీజేపీ నుంచి పాల్వాయి హరీశ్‌బాబు తరఫున కొంగ సత్యనారాయణ, న్యూ ఇండియా పార్టీ నుంచి కోట్రంగే గంతి దాస్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి జాడి దీపక్ కుమార్, ఇండిపెండెంట్‌గా దుర్గం శ్యాంరావ్ లు నామినేషన్లు దాఖలు చేసినట్లు పేర్కొన్నారు.

## మద్యం పట్టివేత

- ఒకరిపై కేసు నమోదు

దహెగాం, నవంబర్ 9: మండల కేంద్రానికి చెందిన బండ సాగర్‌గౌడ్ అక్రమంగా మద్యం విక్రయిస్తుంటే పట్టుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. తను మద్యం అమ్ముతున్నట్లు అందిన పక్కా సమాచారంతో ఇంటిలో సోదాలు చేపట్టగా ఐబీ(180 ఎంఎల్) 17 బాటిళ్లు, ఓసీ(180 ఎంఎల్)7 బాటిళ్ల, కేఎఫ్ లైట్ బీర్లు 12 దొరికాయన్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని సాగర్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా కమ్మర్‌పల్లి, దేవులగూడ గ్రామాల్లో నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించి 250 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ కిషన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


దహెగాం: స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు


చింతలమానేపల్లి : లంబాడిహెట్టిలో ప్రచారం చేస్తున్న నాయకులు

## బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం

చింతలమానేపల్లి, నవంబర్ 9: మండలంలోని లంబాడిహెట్టి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కోనేరు కోనప్పను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఇంటింటా తిరుగుతూ ప్రజలకు మేనిఫెస్టోను వివరించి ఓటు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీలాబాయి, ఎంపీటీసీ ధనరాజ్, హరిలాల్, ఉమేశ్, బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేసీఆరే సీఎం గావాలె..

- ఆయా చోట్ల ప్రజల అభిప్రాయం

### కేసీఆర్ సల్లంగుండాలె..



ఇన్నేళ్లపొద్దు ఎవరు వికలాంగులను ఆదుకోలేదు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత వికలాంగులకు రూ. 4,016 ఇస్తుండు. గతంలోని ప్రభుత్వాలు మమ్ముల్ని ఎవరూ పట్టించుకోలే. పింఛన్‌తో మా ఇంటోళ్లు కూ డా సక్కగా చూసుకుంటుళ్లు. మందులకు దేని కైనా పైసలు పనిక త్తన్నయ్. మళ్లీ గెలుస్తే పెంచుతామని చెప్పిండు. మేమం దరం తండ్రి లాంటి కేసీఆర్‌కే ఓటేసి గెలిపిస్తం.

**-దుర్గం సుగుణ, కాగజ్‌నగర్**

### నెలనెలా పైసలస్తన్నయ్..



మాది పెంచికల్‌పేట్ మండలం మొర్లిగూడ మారుమూల గ్రామం. మా గ్రామానికి పోయేం దుకు వచ్చేందుకు దారికూడా సక్కగా లేకుండే నాడు. కానీ తెలంగాణ సర్కారు వచ్చి నాక మా ఊరికి సక్కటి రోడేసి దారివేసిండు. మాలాంటి పెద్ద మనుసులకు ఆసరాగా ఉండేందుకు ఆసరా పెన్షన్ ఇచ్చి ఆదుకుంటుండు ముఖ్యమంత్రి కేసీఆర్ సారు. ఇంతకు ముందు ఎంతో మందికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాలకులెవరూ లేకుండే. కానీ కేసీఆర్ సారు వచ్చినాక మాసొంటి వాళ్లకు ఎంతో ఆసరై ఆదుకుంటుండు. మళ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే కోనప్పను, కేసీఆర్ సారును మేమంతా గెలిపించుకుంటాం.

**- ఆత్రం మారుబాయి, మొర్లిగూడ, పెంచికల్‌పేట్**

### పెద్ద కొడుకసొంటోడు..



నాది పెంచికల్‌పేట మండల కేంద్రం. నాకు కేసీఆర్ సారు వచ్చినంక మూడు వేలు తర్వాత నాలుగు వేలు పింఛన్ ఇస్తున్నాడు. నా మందుల కోసం నా కన్న కొడుకులు అ సొంటిది ఇయ్యని డబ్బులు ఇయ్యాల కేసీఆర్ సారు నెలనెలా 4వేలు ఇస్తున్నడు. నెలనెలా పైసలు ఇచ్చి ఆదుకుంటున్న కేసీఆర్ సారు నాకు పెద్దకొడుకసొంటోడు . మా ఊరికి తెలంగాణ సర్కార్ వచ్చినాక ఎమ్మెల్యే కోనప్ప సక్కటి రోడు , ఇంటింటికీ మంచినీళ్లు అందిస్తున్నాడు. అంతేకాకుండా మాకు కావల్సిన అన్ని సౌకర్యాలు అందిస్తున్న రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి కోనప్పను, కేసీఆర్‌సారును గెలిపించుకునే బాధ్యత మాది.

**-ఎనగంటి సరోజన, పెంచికల్‌పేట్**

### మమ్ములను ఆదుకున్న దేవుడు కేసీఆర్..



మాసొంటి పేదోళ్లందరిని ఆదుకున్న దేవుడు కేసీఆర్. మాకోసం ఎన్నో సంక్షేమ పథకాలు, ఆసరా పెన్షన్లు, ఇంటింటికీ మంచి నీళ్లు ఇట్లా ఎన్నో పథకాలు అందించి రైతుబంధు, రైతుబీమా ఇస్తున్న దేవుడు కేసీఆర్. ఎన్నికల వేళ ఎంతో మంది మాకు ఓటు వేయమని వస్తున్నరు. కానీ ఎవరూ మా కోసం చేసిందేమీ లేదు. కేసీఆర్ సార్ మా అందరికోసం చేస్తున్న సేవ చెప్పలేనిది. అందుకని మేమంతా రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి కేసీఆర్ సారును ముఖ్యమంత్రి చేసేందుకు మా వంతు కృషి చేస్తాం.

**- మెర్పెల్లి పుల్లయ్య, బాబాసాగర్**